క్లుప్తంగా

పెంపుడు కుక్కల ఆరోగ్య శిబిరం రేపు

బంగారుపాళెం: స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో శుక్రవారం పెంపుడు కుక్కల వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి సహాయ సంచాలకుడు డాక్టర్ ఆసిఫ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు వెల్లడించారు. అలాగే శస్త్రచికిత్స అవసరమైన వాటిని గుర్తించి, శనివారం ఆపరేషన్ చేయనున్నట్లు వివరించారు.

కోనగుంటలో 'ఫ్యామిలీ డాక్టర్'


రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: మండలంలోని కోనగుంట గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కింద గ్రామాల్లోనే రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 104 వాహనంలో 55 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శీతాకాలంలో గర్భిణులు క్రమం తప్పకుండా గోరువెచ్చని నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు.

22న వన సమారాధన


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నేతలు

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురం బోయకొండలో ఈ నెల 22వ తేదీన జిల్లా ఈడిగ గౌడ్ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన మహోత్సవం నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుసా నాగరాజగౌడ్ తెలిపారు. బుధవారం వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయ ఆవరణలో వన సమారాధన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, ఈడిగ గౌడ్ కులస్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సంఘం నేతలు నీరజాక్షులుగౌడ్, జనార్ధన్‌గౌడ్, మురళి, ఎల్లప్ప పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి


మాట్లాడుతున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: పంటల సాగుకు ముందుకు రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ వరలక్ష్మి తెలిపారు. బుధవారం మండలంలోని పొలకల, పేరయ్యగారిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల మేరకు ఎరువులను తగు మోతాదులో వినియోగించుకోవచ్చని చెప్పారు. దీంతో ఖర్చులు తగ్గుతాయని అధిక దిగుబడి, ఆదాయం సాధించవచ్చని వెల్లడించారు. అలాగే రైతులు తాము సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదరిఉ చేయించుకోవాలని కోరారు. బీమీ ప్రీమియం సైతం చెల్లించాలని సూచించారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, పంట కోతలను వాయిదా వేసుకోవాలని స్పష్టం చేశారు.

అభివృద్ధి లక్ష్యాలపై ముగిసిన శిక్షణ


మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ కుసుమకుమారి

ఐరాల: ఎంపీడీఓ కార్యాలయంలో రెండు రోజులపాటు నిర్వహించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై శిక్షణ తరగతులు బుధవారంతో ముగిసినట్లు ఈఓపీఆర్డీ కుసుమకుమారి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క అధికారి పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా ప్రజా ఆరోగ్యం, విద్య, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నా రులు, గర్భిణులు, బాలింతల సంరక్షణ, ఉపాధి హామీ పనులు, వ్యవసాయం తదితర తొమ్మిది లక్ష్యాలను దృష్టిలో పెట్టుకోవాలని కోరారు.

ప్రహరీ కూల్చివేతపై ఫిర్యాదు

పలమనేరు: మండలంలోని చిన్నపేటకురప్పల్లిలో మూడు రోజుల క్రితం ప్రభుత్వ పాఠశాల ప్రహరీని ధ్వంసం చేసి అక్కడున్న చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత హెచ్‌ఎం విజయకుమారి ద్వారా పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసినట్టు ఎంఈఓ లీలారాణి తెలిపారు. ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, పాఠశాలకు జరిగిన నష్టాన్ని ఇప్పించాలని పోలీసులకు తెలిపామన్నారు.

రతనాల రాగి


కుప్పంలో ఏపుగా పెరిగిన రాగి

- నీటి వసతి లేని రైతులకు సౌకర్యమైన పంట
- ఎంతకాలమైనా నిల్వ
- పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువ
- ప్రస్తుతం జిల్లాలో 600 ఎకరాల్లో మాత్రమే సాగు

పలమనేరు: నీటి సౌకర్యం తక్కువగా ఉండి, పెట్టుబడులు పెట్టి సేద్యం చేయలేని రైతులకు రాగి పంట కల్పతరువుగా మారింది. తక్కువ పెట్టుబడితో అధికలాభాలు పొందే అవకాశం ఉండడంతో జిల్లాలోని పడమటి మండలాల రైతులు ఈ రబీ సీజన్‌లో నీటి ఆధారిత పంటగా రాగిని సాగు చేసేందుకు మంచి సమయం. జిల్లాలో సాధారణ రాగి పంట సాగు 1,760 ఎకరాలు కాగా ఇప్పుడు 600 ఎకరాల్లో మాత్రమే సాగైంది. దీన్ని మరింతగా పెంచేందుకు వ్యవసాయ, డ్వామా, హార్టికల్చర్, డీఆర్‌డీఏలు కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చిరుధాన్యాల్లో రాగి రాజసం

శాస్త్రీయంగా ఫింగర్ మిల్లెట్ అని పిలువబడే ఈ పంట పొరుగునే ఉన్న కర్ణాటకలో ఎక్కువగా సాగవుతోంది. జిల్లాలోని పలమనేరు, కుప్పం, పుంగనూరులలో ప్రస్తుతం రాగిని సాగు చేస్తున్నారు. ఎకరా పొలంలో ఆరు తడైతే ఐదు నుంచి ఆరు క్వింటాళ్లు, నీటి వసతి ఉంటే 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం క్వింటాళ్ రాగి ధర రూ.10వేలుగా ఉంది. ఆ లెక్కన నీటి వసతితో పంట చేస్తే రూ.80 వేల దాకా ఆర్జించవచ్చు. ఎకరాకు పంట పెట్టుబడి కేవలం రూ.10వేలు మాత్రమే. దీంతో రూ.70వేల దాకా రైతుకు మిగిలినట్టే. మూడు నెలల్లో పంట చేతికొస్తుంది.

చిరుధాన్యాల పెంపునకు ప్రభుత్వ కృషి ఎక్కడ..?

జిల్లాలో చిరుధాన్యాల సాగును పెంచాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో డ్వామా, హార్టికల్చర్, డీఆర్‌డీఏలు సంయుక్తంగా జిల్లా మహిళా సమాఖ్యతో సమావేశాన్ని నిర్వహించింది. రాగి పంటసాగుతో కలిగే లాభాలను వివరించి పంటసాగుకు పలు ప్రోత్సాహాలనిచ్చింది. జిల్లాలో రాగి సాగును 15వేల ఎకరాలకు పెంచేలా లక్ష్యంగా నిర్ణయించారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిరుధాన్యాలపై ప్రోత్సాహం కరువైంది. రాయితీలు కొండెక్కాయి.

కోవిడ్‌తో రాగిపై మక్కువ...

ఆహారంలో లోపించే మిథియోనైన్ అనే యాసిడ్ రాగిలో ఎక్కువగా ఉంటుంది. అధిక బరువు తగ్గడానికి, మధుమేహ నియంత్రణకు, ఎముకల పుష్టికి, స్థూలకాయ నివారణకు, రక్తహీనత మెరుగుకు, కండరాల బలోపేతానికి ఇదెంతగానో ఉపకరిస్తుంది. దీంతో పాటు ఆందోళనలు తగ్గించడమే కాకుండా త్వరగా వృద్ధాప్యం రాకుండా చేసే గుణం రాగికి ఉంది. అందుకే ప్రస్తుతం రాగి ముద్దతో పాటు రాగిదోసె, ఇడ్లీ, మురుకులు ఎక్కువ ప్రాచుర్యంలో ఉన్నాయి. పెద్ద ఫైవ్‌స్టార్ హోటళ్ల నుంచి చిన్నపాటి దాబాల్లోనూ ప్రస్తుతం రాగిముద్ద తినడం ప్రజలకు ఇప్పుడు ఫ్యాషన్‌గా మారింది.


కుప్పంలో రాగి పంటపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు(ఫైల్)

లాభాల పంట రాగి..



రకరకాల పంటలను సాగు చేసి భారీ పెట్టుబడులు పెట్టి నష్టాలు తెచ్చుకొనే బదులు తక్కువ ఖర్చుతో లాభం వచ్చే రాగి ఇప్పుడు రైతులకు మేలుగా మారింది. చీడపీడల బాధ లేకుండా కూలీల ఖర్చులేకుండా సులభంగా పండే పంట ఇది. నేనూ ఈ దఫా రాగిని సాగుచేస్తున్నా. చిన్న, సన్నకారు రైతులకు సైతం చాలా సులువైన పంట రాగి.

–చందూల్‌రెడ్డి, సేంద్రియ రైతు, కూర్మాయి, పలమనేరు మండలం

రాగి సాగును ప్రోత్సహిస్తున్నాం..



రాగిపంట సాగును పెంచేందుకు అన్ని రకాలుగా కృషిచేస్తున్నాం. ఇప్పటికే జిల్లాలోని మహిళా సమాఖ్య ద్వారా గ్రూపు మహిళలు రాగిని సాగు చేసేలా అవగాహన కల్పించాం. ఈ దఫా 15వేల ఎకరాల్లో రాగి సాగుచేసే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం ఈ రబీలో నీటి ఆధారంగా పంట సాగును పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం.

–మురళీకృష్ణ, డిస్ట్రిక్ అగ్రికల్చర్ ఆఫీసర్, చిత్తూరు

ఒత్తిడిని జయిస్తేనే విజయం



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ బీవీ రెడ్డి

బంగారుపాళెం: విద్యార్థులు ఒత్తిడిని జయిస్తేనే విజయం వైపు అడుగులు వేయగలరని సైకాలజిస్ట్ డాక్టర్ బీవీ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులకు బ్లెస్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీవీ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో ఆందోళనకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే కుటుంబ విలువలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటసుబ్బయ్య, ఐసీటీసీ కౌన్సిల్ బాబు పాల్గొన్నారు.

ఏఆర్ డీఎస్పీగా చిన్నికృష్ణ


చిన్నికృష్ణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఆర్ముడు రిజర్వు (ఏఆర్) డీఎస్పీగా బి.చిన్నికృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో అన్నమయ్య జిల్లా నుంచి చిన్నికృష్ణ బదిలీపై చిత్తూరుకు వచ్చారు. ఈయన 2004లో గ్రేహౌండ్స్ విభాగంలో పని చేస్తూ ప్రతిభ కనబరచి అప్పట్లో రాష్ట్రపతి అవార్డును అందుకున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

- ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర


వినతిపత్రం తీసుకుంటున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. బుధవారం స్థానిక ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయనకు డివిజన్ పరిధిలోని వినియోగదారులు సమస్యలపై ఫిర్యాదు చేశారు. బీఎస్‌ఆర్‌పేటలో వ్యవసాయ సర్వీసుకు తాము తీసివేసిన లైన్‌ను స్తంభానికి బిగించాలని, గిరింపేట పరిధిలో అదనపు సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ కావాలని కోరారు. అలాగే గుడిపాలలో మీటర్ పేరు మార్పు చేయాలని వినియోగదారులు వినతులు చేశారు. సంబంధిత సమస్యలను క్షేత్రస్థాయిలో సిబ్బంది పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఈఈ ఆదేశించారు. కార్యక్రమంలో డీఈలు ప్రసాద్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై తనిఖీలు తప్పనిసరి

- ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు దాటితే బిల్లు
- అధికారులకు ట్రాన్స్‌కో సీజీఎం ఆదిశేషయ్య


మాట్లాడుతున్న సీజీఎం ఆదిశేషయ్య

చిత్తూరు కార్పొరేషన్: గ్రామాల్లో విద్యుత్ చౌర్యం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, క్షేత్రస్థాయిలో సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేసి జరిమానాలు విధించాలని ట్రాన్స్‌కో సీజీఎం ఆదిశేషయ్య ఆదేశించారు. బుధవారం అర్బన్ డివిజన్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సంస్థకు నష్టం వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ సర్వీసులు 200 యూనిట్లు వరకు మాత్రమే విద్యుత్ ఉచితమన్నారు. ఆ పరిమితి దాటితే బిల్లు వసూలు చేయాల్సిందేనని, ఉదాశీనంగా వ్యవహరించరాదన్నారు. ఇటీవల పెండింగ్‌లో పడిన నైట్ రైడ్స్ కార్యక్రమాన్ని తిరిగి కొనసాగించాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేసి అదనపులోడ్, చౌర్యం కేసుల ఉంటే జరిమానాలు వేయాలన్నారు. పనిచేయని విద్యుత్ మీటర్లను సకాలంలో మార్పు చేస్తుండాలన్నారు. వందశాతం కలెక్షన్ల వసూలుకు కృషి చేయాలన్నారు. ఫీడర్ల వారీగా విద్యుత్ ఎక్కడ లాస్ వస్తోందో గుర్తించి సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే తరచూ లైన్ ఇన్‌స్పెక్టర్లు ట్రీ కటింగ్ పనులు చేయించాలన్నారు.కార్యక్రమంలో డీపీఈ ఎస్ఈ శ్రీనివాస్‌బాబు, ఏఓ ప్రసన్నంజనేయులు, ఈఈ మునిచంద్ర, డీఈలు ప్రసాద్, ఆనంద్, కొండయ్య, ఏఈలు, సబ్‌ఇంజనీర్లు పాల్గొన్నారు.

ప్రతి పీహెచ్‌సీలో టీబీ పరీక్షలు తప్పనిసరి


సంక్షేమ శాఖల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీలో టీబీ పరీక్షలు తప్పనిసరిగా చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించారు. వైద్యశాఖ సమీక్షలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన రిజిస్ట్రేషన్లు పకడ్బందీగా చేయాలన్నారు. వ్యాధినిరోధక టీకాలు పిల్లలందరికీ 100శాతం తప్పనిసరిగా వేయాలనన్నారు. జననీ సురక్ష యోజన నగదు ప్రోత్సాహకాన్ని ఎటువంటి సమస్యలు లేకుండా పంపిణీ చేయాలన్నారు. సమీక్షలో డీఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతిదేవి, డీసీహెచ్ఎస్ ప్రభావతి, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటప్రసాద్, ఇతర తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో పనులు నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఇటీవల రాష్ట్రప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల మరమ్మతుల పనులకు నిధులను కేటాయించిందని, 2025 జనవరి 10వ తేదీలోపు మరమ్మతుల టెండర్ ప్రక్రియలను పూర్తి చేయాలన్నారు.

ఇంటి వద్దకే వైద్యం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్, సిబ్బంది

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కింద గ్రామీణ ప్రజలకు ఇంటి వద్దే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. బుధవారం మండలంలోని ఎన్‌పీ పల్లె, నల్లప్పరెడ్డిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. సుమారు 70 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరుచుకోవాలని సూచించారు. గర్భిణులు విధిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

ఉపవర్గీకరణ విచారణకు ఏకసభ్య కమిషన్

చిత్తూరు కలెక్టరేట్: షెడ్యూల్ కులాల్లోని ఉప వర్గీకరణ అంశంపై విచారణకు భారతదేశ అత్యున్నత న్యాయస్థానం ఏకసభ్య కమిషన్‌ను నియమించినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారతదేశ అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పును అనుసరించి రాష్ట్రప్రభుత్వం ఉప వర్గీకరణ విచారణకు ఏకీకృత కమిషన్ అధికారిగా రిటైర్డ్ ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రాను నియమించారన్నారు. సంబంధిత ఏకసభ్య కమిషన్ కార్యాలయం విజయవాడలోని గిరిజన సంక్షేమశాఖ మొదటి అంతస్తులో ఏర్పాటు చేశారన్నారు. జిల్లాలో ఉపవర్గీకరణ అంశానికి సంబంధించి ఎవరైనా సంతకంతో మెమొరాండం, వినతులను వ్యక్తిగతంగా, రిజిస్టర్ పోస్టు, మెయిల్‌లో 2025 జనవరి 9వ తేదీలోపు ఇవ్వాలన్నారు. omcrcrubcarrificaotn@fmai.com కు గడువు తేదీలోపు వినతులను పంపాలని డీడీ కోరారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం



చౌడేపల్లె: చారాల ఉన్నత పాఠశాలలో 1987–88లో చదివిన పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రయాణికులు, విద్యార్థులకు సౌకర్యార్థం బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. బుధవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పలమనేరు వైపు వెళ్లే ప్రయాణికులకు, పిల్లలకు సౌకర్యంగా ఉండేలా పాఠశాల ముందు రోడ్డుపక్కన ఏర్పాటు చేస్తున్నారు. రూ.2 లక్షల నిధులు కేటాయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ముద్దప్ప, జనార్దన్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయాను తొలగించిన హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్: ఆయాగా పనిచేస్తున్న దళిత మహిళ పూంగుడిని అక్రమంగా తొలగించిన హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ నాయకులు బుధవారం డీఈఓ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం ఏడీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ చిత్తూరు నియోజకవర్గ కార్యదర్శి దాసరి చంద్ర యూనియన్ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బంగారుపాళ్యం మండలం కొదలమడుగు ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదేళ్లుగా పనిచేస్తున్న ఆయా పూంగుడిని రాజకీయ వేధింపులకు తలొగ్గి ఆ స్కూల్ హెచ్‌ఎం తొలగించారని ఆరోపించారు. చిరుద్యోగులను అన్యాయంగా తొలగిస్తున్న కూటమి సర్కారు ధోరణి సరైంది కాదని విమర్శించారు. ఎలాంటి తప్పు లేకున్నప్పటికీ ఆమెను తొలగించడం అన్యాయమన్నారు. ఆమెను తిరిగి విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక


శిక్షణకు హాజరైన సర్పంచులు, అధికారులు


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీధర్

బంగారుపాళెం: గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందించుకోవాలని ఎంపీడీఓ శ్రీధర్ సూచించారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్ఏ) కింద కార్యాచరణ ప్రణాళిక-స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతోందని, సర్పంచులు ఆ దిశగా పనులు గుర్తించాలన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సమస్యల పరిష్కారంపై శ్రద్ధ వహించాలని కోరారు. గ్రామ స్థాయిలోనే యువతకు ఉపాధి అవకాశాలను అన్వేషించాలని సూచించారు. పేదరికం లేని మెరుగైన జీవనోపాధి కల్పనకు కృషి చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రిసోర్సు పర్సన్లు ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ గణపతి, వెలుగు ఏపీఎం రవి పాల్గొన్నారు.

హే రామ్..!



చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర వాసుల ఐకాన్ గాంధీ విగ్రహం. నగరంలోని ఓ మూల, ఎటు వెళ్లినా, చివరకు గాంధీ విగ్రహం కూడలిలోకి రావాల్సిందే. నగర వాసులు గుర్తింపుగా చెప్పుకునే గాంధీ విగ్రహం చుట్టూ కార్పొరేషన్ నిధులతో నీటి కొలను ఏర్పాటు చేశారు. సందర్శకులు సైతం కాసేపు ఆసక్తిగా చూసి వెళ్లేవారు. అయితే కాలక్రమంలో దాని పర్యవేక్షణ, నీటికొలను శుభ్రతను అధికారులు విస్మరించడంతో గాంధీ విగ్రహం కళాహీనంగా మారింది. కొలనులోని నీళ్లంతా పచ్చగా మారి పాచి పట్టడంతో దుర్గంధం చిమ్ముతోంది. ఈ దుస్థితిపై హే రామ్ అని గాంధీ విగ్రహం ఘోషిస్తోంది.

–చిత్తూరు అర్బన్

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి


సంకటహర చతుర్థివ్రతమాచరిస్తున్న భక్తులు


బంగారు రథంలో ఊరేగుతున్న స్వామివారు

కాణిపాకం: స్వయంభు శ్రీ కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానంలో బుధవారం శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి గణపతి వ్రతం నిర్వహించారు. ఉదయం ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా సుగంధ పుష్పాలతో అలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ అధికారులు ఉత్సవము మూర్తులను మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి ఆస్థాన మండపంలో కొలువుదీర్చారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు శాస్త్రోక్తంగా సంకటహర చతర్థి, గణపతి వ్రతాన్ని ఆలయ అర్చక వేద పండితులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్, ఈఓ పెంచల కిషోర్ తదితరులు పాల్గొన్నారు. తదనంతరం గోశాలను తనిఖీ చేశారు. గోవులను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు.

స్వర్ణరథంపై స్వామివారు ..

స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి బుధవారం రాత్రి ఆలయ మాడవీధులలో భక్తుల కోలాహలం నడుమ స్వర్ణ రథంపై వైభవంగా విహరించారు. ప్రధాన ఆలయంలో సాయంత్రం అలంకార మండపంలో వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు ఆలయ అర్చక, వేద పండితులు ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి స్వర్ణ రథం మేళతాళాలతో, మంగళ వాయిద్యాలతో ఆలయ మాడవీధులలో వైభవంగా ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని కర్పూర మంగళహారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన యూసీమాస్ అబాకస్ సంస్థ విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో చిత్తూరులోని యూసీమాస్ అబాకస్ సంస్థ విద్యార్థులు ప్రతిభ చాటారని ఆ సంస్థ డైరెక్టర్లు భార్గవి, ఉమ బుధవారం విలేకరులకు తెలిపారు. ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో 35 దేశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారని, వివిధ దశల్లో నిర్వహించిన ఈ పోటీల్లో ఏపీ తరఫున చిత్తూరు జిల్లా నుంచి తమ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారని చెప్పారు. తమ వద్ద శిక్షణ పొందిన యుక్తశ్రీ, రెడ్డి దీక్షిత్, రక్షణ్, తన్వీర్ ఛాంపియన్లుగా నిలిచి స్వర్ణపతకాలు సాధించారన్నారు. అలాగే మరో తొమ్మిది మంది విద్యార్థులు స్వర్ణ పతకాలు, ఏడుగురు రజత, మరో ఏడుగురు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆ విద్యార్థులను సంస్థ డైరెక్టర్లు, తల్లిదండ్రులు అభినందించారు.